క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కొనకనమిట్ల: గ్రామ సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం ఆయన చింతగుంట గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాయలంలో పంచాయతీ కార్యదర్శులతో గ్రామ పంచాయతీల పురోగతి 2.0పై సమీక్షించారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓఆర్డీ శ్రీదేవి, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. జ

మట్టిమిద్దె కూలి వృద్ధురాలికి గాయాలు


పడిపోయిన మిద్దె


గాయాలపాలైన రోశమ్మ

గిద్దలూరు రూరల్: అకస్మాత్తుగా మట్టిమిద్దె పైకప్పు కూలడంతో ఓ వృద్ధురాలికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గిద్దలూరు పట్టణంలోని శర్మ వీధిలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు.. జక్కుల రోశమ్మకు చెందిన మట్టి మిద్దె ఇటీవల కురిసిన వర్షాలకు నానింది. పాతమిద్దె కావడంతో దంతెలు విరిగిపోయి పైకప్పు ఒక్కసారిగా పడిపోయింది. ఆ సమయంలో ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న రోశమ్మపై దంతెలు పడటంతో గాయాలయ్యాయి. రోశమ్మ ఆర్తనాదాలు విన్న స్థానికులు హుటాహుటిన స్పందించి ఆమెను బయటకు తీసుకొచ్చారు. రోశమ్మ కుమారుడు మృతి చెందగా, కుమార్తె హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. ఇల్లు కూలడంతో సామగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రభుత్వం, దాతలు స్పందించి ఆదుకోవాలని వృద్ధురాలు రోశమ్మ విజ్ఞప్తి చేస్తోంది.

వద్దండోయ్.. చదువుల కిచిడీ!

పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులను అటకెక్కించేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రెండో విద్యా సంవత్సరంలోనూ సర్కారు బడులను సమస్యలు వీడలేదు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా బోధనాపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టడంలో సర్కారు ఘోరంగా విఫలమైందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.


బడి మార్చవద్దంటూ ఇటీవల ఆందోళనకు దిగిన ఖాజీపురం ఎస్సీ కాలనీ వాసులు

- అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ
- 21 నుంచి 50 మంది విద్యార్థులున్నా సింగిల్ టీచరే దిక్కు
- టీచర్లు లేరన్న కారణంతో టీసీలు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు
- పాఠశాలల విలీనం తీరుపై తల్లిదండ్రుల ఆందోళన
- వసతులు కల్పించకుండానే పాఠశాలల అప్‌గ్రేడ్‌తో కొత్త చిక్కులు
- గిద్దలూరు నియోజకవర్గంలో 77 ఏకోపాధ్యాయ స్కూళ్లు
- డిప్యుటేషన్‌పై పంపి పాఠాలు చెప్పించేందుకూ గురువుల కొరత
- బదిలీ అయినప్పటికీ రిలీవర్ లేక ఎక్కడి టీచర్లు అక్కడే..

బేస్తవారిపేట:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హడావుడిగా పలు పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు మరికొన్నింటిని విలీనం చేసే ప్రక్రియకు పూనుకుంది. అయితే పాఠశాలల్లో అందుకు తగిన వసతులు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరతతో సర్కారు లక్ష్యం నెరవేరకపోగా కొత్త చిక్కులు మొదలయ్యాయి. ఉన్న ఊర్లో పాఠశాలలు మూతపడుతుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను దూరాభారమైనా ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. కొన్ని స్కూళ్లను దూరప్రాంతంలోని పాఠశాలల్లో విలీనం చేయడంతో పేద విద్యార్థులు రాకపోకలు సాగించలేక రోజూ సతమతమవుతున్నారు.

బోధనేతర పనుల్లోనే గురువులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఉపాధ్యాయులు తరగతి గదుల కంటే బడి బయటే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. పాఠశాలలు తెరిచి మూడు నెలలు అవుతుండగా, ఈ సమయంలో టీచర్లను అధిక భాగం బోధనేతర పనులకే కేటాయించడంతో విద్యాబోధన కుంటుపడింది. తరగతి గదుల్లో పాఠాలు చెప్పాల్సిన టీచర్లు యోగాంధ్ర ప్రాక్టీస్, మెగా పీటీఎం, లీడర్‌షిప్ శిక్షణకు ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చింది. సరైన ప్రణాళికలు లేకుండా అమలు చేస్తున్న కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఇదిలా ఉండగా స్కూళ్లలో 18 రకాల హ్యాండ్‌బుక్‌లు, లెసన్ ప్లాన్లు, టీచర్స్ డైరీ రాయడం, విద్యార్థుల స్థాయిని గుర్తించడం, సీ గ్రేడ్ పిల్లలకు ప్రత్యేక తరగతులు.. ఇవన్నీ చేస్తూనే ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు హాజరుకావడం భారంగా ఉందని టీచర్లు మనోవేదనకు గురవుతున్నారు.

అలా.. నెట్టుకొస్తున్నారు!

విద్యాహక్కు చట్టం నిబంధనలు గిద్దలూరు నియోజకవర్గంలో సక్రమంగా అమలు కావడం లేదు. పాఠశాలల్లో 21 మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ ఒక ఉపాధ్యాయుడితోనే నెట్టుకొస్తున్నారు. బేస్తవారిపేట మండలంలోని ఎంపీ చెరువు, బాలేశ్వరపురం, నారువానిపల్లె, పోగుళ్ల, చెన్నుపల్లె, శింగసానిపల్లె, వంగపాడు, కలగొట్ల, అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లె, పోతురాజుటూరు, మాగుటూరు, కొమరోలు మండలంలోని అక్కపల్లె, పాట్టిపల్లె పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాల్సి ఉన్నప్పటికీ ఒకరినే నియమించారు. గిద్దలూరు నియోజకవర్గంలోని 13 పాఠశాలల్లో 25 నుంచి 50 మంది వరకు విద్యార్థులు ఉన్నప్పటికీ ఒక టీచర్‌తోనే పాఠాలు బోధిస్తుండటం గమనార్హం. కోనపల్లె ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఎంపిక చేయడంతో నలుగురు ఉపాధ్యాయులతో చక్కటి బోధన అందుతుందని తల్లిదండ్రులు సంతోషపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో 60 మంది విద్యార్థులు ఉన్న ఈ స్కూల్లో ఒక ఉపాధ్యాయుడే అన్ని తరగతులకు పాఠాలు చెబుతుండటంతో ఆవేదన చెందిన తల్లిదండ్రులు 20 మంది విద్యార్థుల టీసీలు తీసుకుని వెళ్లారు. శింగసానిపల్లె ప్రాథమిక పాఠశాలలో 37 మంది విద్యార్థులకు ఒక్క టీచరే పాఠాలు చెప్పాల్సి రావడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

రిలీవర్లు రాక ఎక్కడివారు అక్కడే..

కోనపల్లె మోడల్ స్కూల్లో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడు గలిజేరుగుళ్ల హైస్కూల్‌కు బదిలీ కోరుకున్నారు. రిలీవర్ రాకపోవడంతో ఇప్పటికీ అక్కడే పనిచేయాల్సిన పరిస్థితి. గలిజేరుగుళ్ల హైస్కూల్లో 3, 4, 5 తరగతులకు ఉపాధ్యాయులు లేరు. ఇక్కడికి బదిలీపై రావాల్సిన ఉపాధ్యాయులకు వారు పనిచేసేచోట రిలీవర్ రాకపోవడంతో ఎక్కడివాళ్లు అక్కడే ఉండిపోయారు. గలిజేరుగుళ్ల ప్రాథమిక పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లతో పాఠాలు చెప్పిస్తున్నారు. పోగుళ్లలో ఉపాధ్యాయుడు బదిలీ కోరుకున్నప్పటికీ రిలీవర్ లేక యథాస్థానంలోనే కొనసాగుతున్నారు. ఇదే పరిస్థితి గిద్దలూరు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో నెలకొంది.


ఒక ఉపాధ్యాయుడితోనే నడుస్తున్న కోనపల్లె మోడల్ స్కూల్


బేస్తవారిపేట మండలం పీవీపురంలో మూతపడిన ప్రాథమిక పాఠశాల


37 మంది విద్యార్థులకుగాను ఒక టీచరే ఉన్న శింగసానిపల్లె పాఠశాల

స్కూళ్లకు అప్రకటిత సెలవులు

గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట మండలంలో 13, అర్ధవీడులో 5, కొమరోలులో 20, గిద్దలూరులో 17, కంభంలో 9, రాచర్ల మండలంలో 13 పాఠశాలల్లో కేవలం ఒక ఉపాధ్యాయుడే పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులకు అత్యవసరంగా సెలవు అవసరమైనప్పుడు పక్క పాఠశాలల నుంచి డిప్యుటేషన్‌పై మరో టీచర్‌ను పంపేందుకు కూడా అవకాశం లేకపోవడంతో ఆయా రోజుల్లో స్కూళ్లకు అప్రకటిత సెలవు ఇవ్వాల్సి వస్తోంది. నియోజకవర్గంలో మొత్తం 77 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు క్యాజువల్, సిక్ లీవ్ పెట్టేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు టీచర్లు వెళ్లినప్పుడు ఆయా పాఠశాలలు మూతపడుతున్నాయి.

శైలపుత్రిగా జగదాంబ


మార్కాపురం : బాలా త్రిపురసుందరీ దేవీగా వాసవీమాత


గిద్దలూరులో కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


కంభంలో కన్యకాపరమేశ్వరిగా వాసవీమాత


బేస్తవారిపేటలో కన్యకాపరమేశ్వరిగా వాసవీమాత

- వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మార్కాపురం టౌన్: దసరా శరన్నవరాత్రి వేడుకలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవారిని తొలిరోజు వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. మార్కాపురంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారు శైలపుత్రి అలంకారంలో, శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజ్యలక్ష్మి మాతగా, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవిగా, అమలక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో అమ్మవారు రాజ్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం, పెదారికట్ల శివాలయం, మహాలక్ష్మమ్మ దేవాలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రంలో వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు అమ్మవారికి కలశస్థాపన చేసి ఉభయదాతలతో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కన్యకాపరమేశ్వరిగా వాసవీమాత

బేస్తవారిపేట: మండల కేంద్రమైన బేస్తవారిపేటలో వాసవీ మాత ఆలయంలో అమ్మవారు కన్యకాపరమేశ్వరిదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో చౌడేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోటసత్యమాంబదేవి, పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కంభం: స్థానిక అమ్మవారిశాలలో సోమవారం వాసవీ మాత కన్యకాపరమేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కలశాలతో పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని రామాలయంలో అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. అర్చకుడు కట్టా సతీష్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని వాసవీ మాత ఆలయంలో అమ్మవారు కన్యకాపరమేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలిరోజు పూజల్లో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్థానిక వాసవీ మాత ఆలయం, రేడియో బావి సమీపంలోని కాళికామాత ఆలయం, కాశినాయకుంటలోని గాయత్రిమాత ఆలయంలో, నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయాల్లో సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. షరాబ్ బజారులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, రాచర్ల రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.


మార్కాపురం : చెన్నకేశవాలయంలో రాజ్యలక్ష్మిగా


కొమరోలులో కన్యకాపరమేశ్వరి రూపంలో వాసవీమాత


గొట్లగట్టు రామాలయంలో పూజలు

ర్యాగింగ్‌తో జీవితం నాశనం

మార్కాపురం: కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకు వెళ్తారని తద్వారా భవిష్యత్తు అంధకారంగా మారుతుందని విద్యార్థులను మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు హెచ్చరించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు హితవు పలికారు. సోమవారం స్థానిక డాక్టర్ శామ్యూల్‌జార్జి ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడితే బంగారు భవిష్యత్ పాడైపోతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. మార్కాపురం సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ర్యాగింగ్‌తో కలిగే అనర్థాలను ఎస్సై అంకమరావు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, ప్రొఫెసర్లు సాధూనాయక్, సత్యనారాయణ, శ్రీనివాసులు, డానియేల్, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాప్ కెమెరాలకు చిక్కిన రేసు కుక్క


సీసీ కెమెరాలో చిక్కిన రేసు కుక్క

అర్ధవీడు: మండలంలోని అటవీ ప్రాంతంలో పులుల సంచారాన్ని గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు రేసు కుక్క చిక్కింది. నాగార్జున సాగర్ నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు 76 రేస్ కుక్కలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఇవి చాలా చురుకుగా ఉంటాయని, అటవీ ప్రాంతాన్ని సంరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


మార్కాపురంలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మార్కాపురం టౌన్: గడిచిన 16 నెలల కాలానికి సంబంధించి 6 విడతలుగా ఇవ్వాల్సిన ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతోపాటు 7వ విడత నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మార్కాపురంలో కళాశాలల బంద్ నిర్వహించారు. స్థానిక వేమన మహిళా డిగ్రీ కళాశాల వద్ద చేపట్టిన బంద్ కార్యక్రమంలో అధ్యాపకులు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు రాకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారుతోందని, కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేని స్థితిలో యాజమాన్యాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాము బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతమ్మ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కోసం నిరసన

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులోని మోడంపల్లె క్రాస్ రోడ్డు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ మోడంపల్లె గ్రామానికి చెందిన రైతులు, రైల్వే ట్రాక్ అవతలి వైపు ఉన్న జగనన్న కాలనీ వాసులు సోమవారం నిరసన తెలిపారు. గుంటూరు–గుంతకల్ మధ్య రైల్వే డబ్లింగ్ పూర్తయ్యాక రైళ్ల రాకపోకలు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) ఏర్పాటు చేయడం ద్వారా సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.


ఆర్‌యూబీ నిర్మించాలని నిరసన తెలుపుతున్న స్థానికులు

బాధ్యతలు చేపట్టిన అర్ధవీడు ఎంపీడీఓ


ఖాశింపీరా

అర్ధవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా షేక్ ఖాశింపీరా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మద్దిపూడిలో ఏఓగా విధులు నిర్వరిస్తూ పదోన్నతిపై అర్ధవీడు ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని రాజాజీవీధి, చెన్నకేశవస్వామి గుడిలైన్ తదితర ప్రాంతాల్లో సింగిల్ యూజన్ కవర్లపై కమిషనర్ నారాయణరావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 50 మైక్రాన్లకు పైగా ఉన్న కవర్లు మాత్రమే వినియోగించాలని, వీటి స్థానంలో జూట్, పేపర్ కవర్లు, క్లాత్ బ్యాగులను వాడాలని కోరారు. అనధికార ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయాలపాలైన నాగేంద్ర వెంకటసుబ్బయ్య

గిద్దలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కలసపాడు గ్రామానికి చెందిన నాగేంద్ర, తల్లిదండ్రులు వెంకటసుబ్బయ్య, సుబ్బమ్మలను బైక్‌పై ఎక్కించుకుని గిద్దలూరు వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నాగేంద్రకు తలకు బలమైన గాయమైంది. తండ్రి వెంకటసుబ్బయ్యకు కాలు విరగ్గా, తల్లి సుబ్బమ్మకు కాళ్లకు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రులను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం నంద్యాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

రాచర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొనాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొనకనమిట్ల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని గొట్లగట్టు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్వీ.బాలయ్య సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సిద్ధవరం గ్రామంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న పలువురికి రక్త పరీక్షలు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతోపాటు దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ జె.వెంకటేశ్వర్లు, సంయుక్త, గౌతమ్, ఏఎన్‌ఎంలు సుజాత, లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడివారిపల్లిలో..

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లిలో సోమవారం తర్లుపాడు పీహెచ్‌సీ డాక్టర్ సోనీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు పోషకాహారం, రక్తహీనత నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి వివరించారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

సర్పంచ్ జాన్‌రత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


సిద్ధవరంలో స్వస్థ్ నారీ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, ప్రజలు


తాడివారిపల్లెలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న డాక్టర్, సర్పంచ్